




మంచుకురిసే వేళలో...

సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రాన్ని పొగమంచు కమ్మేసింది. బుధవారం తెల్లవారుజామున ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు మంచు దుప్పటి కమ్మేసింది. పొగమంచు ధాటికి రోడ్లు కనిపించక వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సూర్యకిరణాలు భూమిని తాకకుండా పొగమంచు అడ్డుకుంది. సిరిసిల్లతోపాటు తంగళ్లపల్లి మానేరు వంతెన, పెద్దూరు, రగుడు, ముస్తాబాద్ మండలం ఆవునూరు-గూడెం పరిసరాల్లో మంచు కురిసింది.

క్లుప్తంగా

'ఆది'ని కలిసిన పద్మశాలీ సంఘం అధ్యక్షుడు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గోలి వెంకటరమణ, యెల్లె లక్ష్మీనారాయణ

సిరిసిల్ల: వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను బుధవారం సిరిసిల్ల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ కలిశారు. వేములవాడలో ఆది శ్రీనివాస్‌ను కలిసి సన్మానించారు. సిరిసిల్ల పట్టణ అభివృద్ధి ప్రభుత్వపరంగా సహకరించాలని కోరారు.

సన్మానం

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజీపేట, లింగంపల్లి, బొల్లారం గ్రామాల్లో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన మొదటిసారి గ్రామాలకు రావడంతో పార్టీలకతీతంగా ఆయాగ్రామాల్లో డప్పు చప్పుళ్ల మధ్య ఘనస్వాగతం పలుకుతూ సన్మానించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండల సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ వుట్కూరి వెంకటరమణరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మీర్జా తెలిపారు. ఎంపీపీ వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారయణ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండల ఎంపీటీసీలు, సర్పంచులు, మండలంలోని అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఖాతాదారులకు అవగాహన


మాట్లాడుతున్న మేనేజర్ చందు

ముస్తాబాద్: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులకు బుధవారం ఆర్థిక, సాంకేతిక అవగాహన సదస్సును గూడెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ చందు మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతాదారులకు రుణాలు, డిపాజిట్లు, బంగారు రుణాలపై అవగాహన కల్పించారు. యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్, పీఎం ఎస్‌బీఐ, జనరల్ ఇన్సూరెన్స్‌పై వివరించారు. యూపీఐ చెల్లింపులపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో మోసాలు జరుగుతున్నాయన్నారు. ఇతరులకు యూపీఐ పిన్ నెంబర్ చెప్పవద్దని సూచించారు. అనంతరం ఎస్సెస్సీ విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు అందించారు. సర్పంచ్ చిట్నేని సరిత, బ్యాంక్ సిబ్బంది రవి, పర్శ రాములు, సీసీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

గంభీరావుపేట: మండలంలోని సముద్రలింగాపూర్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు అందిస్తున్న సేవలను, రుణాలను, లావాదేవీల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోతె రాజిరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రామానుజాగౌడ్, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం


ప్రిన్సిపాల్ పద్మ

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగో తరగతి చదువుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జనవరి 6లోపు దరఖాస్తు చేసుకోవాలని ఫిబ్రవరి 11న ప్రవేశ జరుగుతుందన్నారు.

వసతులు కల్పించండి

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజుయాదవ్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిశారు. ఎల్లారెడ్డిపేట హైస్కూల్, కిషన్‌దాస్‌పేట ప్రైమరీ స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరారు.

పశువైద్య శిబిరం



బోయినపల్లి: మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో బుధవారం మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి రమేశ్, మెరుపుల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రాములోరి అక్షింతలతో శోభాయాత్ర

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాల, అక్కపెల్లి, రాచర్లగుండారం గ్రామాల్లో బుధవారం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. భజనలు, మంగళహారతులతో చేపట్టిన శోభాయాత్ర ఆకట్టుకుంది. హనుమాన్ ఆలయం నుంచి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగింది. సర్పంచులు రజిత, ముక్క మధుకర్, బూక్య శంకర్ నాయక్, ఎంపీటీసీలు కదిరె భాస్కర్, వరద బాబు, ఆలయ కమిటీ చైర్మన్లు, మహిళలు పాల్గొన్నారు.


దుమాలలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

సాగునీటిని విడుదల చేయండి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: సింగసముద్రం ఆయకట్టు భూములకు సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ సింగసముద్రం కనెక్టింగ్ కాలువల పూడికతీత చైర్మన్ ఒగ్గు బాలరాజు ఆర్‌ఐ శ్యామలకు బుధవారం వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎల్లారెడ్డిపేట, రాచర్ల బొప్పాపూర్, నారాయణపూర్, కోరుట్లపేట, సర్వాయిపల్లె గ్రామాల్లోని 1600 ఎకరాల ఆయకట్టు సాగుకు నీరందించేందుకు గండ్లను పూడ్చినట్లు వివరించారు. సింగసముద్రం నీటి సంఘం మాజీ చైర్మన్ నేవూరి బాలయ్య, గోపాల్‌రెడ్డి, గుడి విఠల్‌రెడ్డి, రాజుయాదవ్, పయ్యావుల రాజుయాదవ్, బాయికాడి రాజయ్య, శరవింద్, సత్యనారాయణ, బాల్‌రెడ్డి, ఆరె నర్సింహులు, పోచయ్య, శంకరయ్య, ఎల్లం పాల్గొన్నారు.

జౌళిశాఖ మంత్రిని కలిసిన వస్త్రోత్పత్తిదారులు


మంత్రి తుమ్మలతో సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులు బుధవారం హైదరాబాద్ రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిశారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు సంబంధించిన సమస్యలపై మంత్రికి వస్త్రోత్పత్తిదారులు వివరించారు. తొందరలోనే సిరిసిల్ల కార్మికులు, ఆసాములు, వస్త్రోత్పత్తిదారులతో సమావేశం నిర్వహిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. వస్త్రోత్పత్తిదారులు సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో వెళ్లి మంత్రిని కలిశారు. సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు మండల సత్యం, ఉపాధ్యక్షుడు బూట్ల నవీన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, వస్త్రోత్పత్తిదారులు మోర రాజు, అనుమాండ్ల రాంనారాయణ, మ్యాక్స్ సంఘాల ప్రతినిధి యెల్దండి శంకర్, కాంగ్రెస్ నాయకులు కాముని నళినికాంత్, వెల్ముల తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం


సమయం కంటే ముందే తెరిచిన మద్యం దుకాణం

కోనరావుపేట: మద్య దుకాణం నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అన్ని మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్య మాత్రమే తెరిచి ఉంచాలి. కానీ మండలకేంద్రంలోని వైన్స్ నిర్వాహకులు ఉదయం 9.30 గంటలకే మద్యం దుకాణం తెరుస్తూ విక్రయాలు జరుపుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బుధవారం ఉదయం 9.30 గంటలకే మద్యం దుకాణం తెరవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా మద్యం దుకాణాన్ని ఉదయం 10 గంటలనుంచి రాత్రి 10 గంటల మధ్య తెరిచి ఉంచాలని, మండల కేంద్రంలోని మద్యం దుకాణం సమయానికి ముందే తెరవడంపై చర్యలు తీసుకుంటామన్నారు.

గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి


నారాయణ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): మండలకేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ గుండెపోటుతో మృతిచెందాడు. కోనరావుపేటకు చెందిన గూడెం నారాయణ (55) పదేళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకంతో ఉపాధి తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో బుధవారం పత్తి ఏరే కూలీలను తరలించి ఇంటికొచ్చాడు. సాయంత్రం గుండెపోటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సిరిసిల్ల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు భాస్కర్, స్వామి ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ అధ్యక్షుడు బాపురెడ్డి కోరారు.

మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు



తంగళ్లపల్లి: మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్ హెచ్చరించారు. పెద్దలింగాపూర్, ఇల్లంతకుంటలో వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. వేములవాడకు చెందిన నేరెళ్ల సతీశ్, రాయల నరేశ్, పెద్దలింగాపూర్‌కు చెందిన రమేశ్, అనంతారంకు చెందిన దండ్ల బాబుపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. సరైన ధ్రువపత్రాలు లేని 20 మందికి రూ.2,300 జరిమానా విధించినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుళ్లు సత్యనారాయణ, శ్రీనివాస్, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈవో గీత


రాజన్నపేటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న గీత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఈనెల 28 నుంచి నిర్వహిసున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో గీత పేర్కొన్నారు. మండలంలోని రాజన్నపేటలో ప్రజాపాలన కార్యక్రమ ఏర్పాట్లను బుధవారం పరిశీలించి మాట్లాడారు. జనాభాకు సరిపడ కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ప్రజాపాలన నిర్వహణలో నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీవో వజీర్, కార్యదర్శి రవి, సర్పంచ్ శంకర్, సిబ్బంది ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట: ఆరు గ్యారంటీల అమలుకోసం ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి కోరారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలు నిర్ణీత దరఖాస్తు ఫారాల్లో పథకాల కోసం ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు హమీద్, నాయకులు దమ్మ శ్రీనివాస్ రెడ్డి, ఎడబోయిన ప్రభాకర్, తాజోద్దీన్, ఎర్ర నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు


మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్లలో బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాలలో బుధవారం ఎస్సై వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులకు 'ర్యాగింగ్ – పర్యవసనాలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో విద్వేషాలు పెంచుకోవదన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్.రమేశ్, విద్యార్థి కార్యకలాపాల ఇన్‌చార్జి డి.కుమారస్వామి, బోధనేతర సిబ్బంది, పాల్గొన్నారు.

నేటినుంచి గ్రామసభలు

సిరిసిల్లటౌన్: 'ప్రజాపాలన' కార్యక్రమాన్ని వార్డుల వారీగా చేపడుతున్నట్లు సిరిసిల్ల మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం 1నుంచి 5 వార్డుల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 6వ వార్డు నుంచి 10వ వార్డుల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఆరు గ్యారంటీల కోసం సమర్పించే అర్జీలను నిర్ణీత సమయాల్లో వార్డుల ఇన్‌చార్జి అధికారులు ఇచ్చిన పత్రాల్లోనే వివరాలు అందించాలన్నారు.

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో ఈనెల 28 నుంచి ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. 28న గొల్లపల్లి (కొలనూర్), కొలనూర్, బావుసాయిపేట, గోవిందరావుపేట తండాలో, 29న ధర్మారం, మర్తనపేట, గొల్లపల్లి (వట్టిమల్ల), వట్టిమల్ల గ్రామాల్లో, 30న మంగళ్లపల్లి, సుద్దాల, కమ్మరిపేటతండా, మరిమడ్ల గ్రామాల్లో, జనవరి 2న పల్లిమక్త, కనగర్తి, అజ్మీరాతండా, నిమ్మపల్లి, 3న మామిడిపల్లి, నిజామా బాద్, భుక్యారెడ్డితండా, ఊరుతండా (నిమ్మపల్లి), 4న కొండాపూర్, వెంకట్రావుపేట, ఎగ్లాస్‌పూర్, కోనరావుపేట, 5న నాగారం, రామన్నపేట, మలక్‌పేట, శివంగాలపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల్లోని కుటుంబాలకు ఒకరోజు ముందే ముందే దరఖాస్తు ఫారాలు అందిస్తామని, వారికి కేటాయించిన రోజుల్లో ఫారాలను నింపి అప్పగించి రసీదు పొందాలన్నారు.

వేములవాడ రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వేములవాడ రూరల్ తహసీల్దార్ సుజాత తెలిపారు. నేటినుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. వేములవాడ రూరల్ మండలం నుంచి 17 గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేక అధికారులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

వేములవాడఅర్బన్: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నుంచి ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. ఈనెల 28న ఉదయం కొడుముంజ, మధ్యాహ్నం చింతల్‌ఠాణా, 29న ఆరెపల్లి, మధ్యాహ్నం సంకెపల్లి, 30న చంద్రగిరి, శాభాష్‌పల్లి, జనవరి 2న మారుపాక, గుర్రవానిపల్లి, జనవరి 3న అనుపురం, 4న చీర్లవంచ, జనవరి 5న రుద్రవరం గ్రామాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వీర్నపల్లి: నేటినుంచి జనవరి 6వరకు ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ నరేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 28న అడవిపదిర, బాబాయి చెరువు తండా, బంజేరు, బావుసింగ్ తండా గ్రామాలు, 29న భూక్యతండా, ఎర్రగడ్డ, గర్జనపల్లి, జవహర్ తండా, గ్రామాలు, 30న కంచర్ల, లాల్‌సింగ్ తండా, మద్దిమల్ల, మద్దిమల్ల తండా, 2న రంగంపేట, 3న, సీతారామ్ తండా, 4న శాంతినగర్, 5న వన్‌పల్లి, 6న వీర్నపల్లి గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

తంగళ్లపల్లి: మండలంలో గురువారం ప్రజాపాలన సమావేశాలు ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో పి.లచ్చాలు తెలిపారు. మొదటి రోజు అంకిరెడ్డిపల్లె, అంకుషాపూర్‌లో బద్దెనపల్లి, బాలమల్లుపల్లె గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఈకేవైసీ కోసం బారులు

కోనరావుపేట: మండలకేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఎదుట వినియోగదారులు బారులు తీరుతున్నారు. గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని చెబుతుండడంతో ఆయా గ్రామాల వినియోగదారులు మండల గ్యాస్ ఏజెన్సీ ముందు క్యూ కడుతున్నారు. గ్యాస్ కంపెనీలో సర్వర్ మొరాయించడంతో ఈకేవైసీ కావడంలేదు. మండలంలోని గ్రామాల్లోనే ఈకేవైసీ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని అన్ని గ్రామాల ప్రజలు, వినియోగదారులు కోరుతున్నారు.

శిథిలావస్థలో ఇరిగేషన్ భవనం

- రైతులకు అందని సేవలు
- అద్దె భవనంలోనే కార్యాలయం
- రూ.30లక్షల ప్రతిపాదనలకు మోక్షం లభించేనా !


నామాపూర్‌లో ఇరిగేషన్ కార్యాలయం

ముస్తాబాద్: నిజాం కాలంనాటి ఇరిగేషన్ భవనం పూర్తిగా శిథిలమైంది. 75ఏళ్లగా రైతులకు సేవలు అందించిన సెక్షన్ కార్యాలయం కూలిపోయింది. ఆలనా పాలన కరువై స్థలం కబ్జాకు గురవుతోంది. నిజాం ఆఖరి నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ నర్మాలలో చిన్న తరహా నీటి పారుదల ప్రాజెక్టును నిర్మించారు. అప్పుడే నామాపూర్‌లో సెక్షన్ కార్యాలయాన్ని పర్యవేక్షణ కోసం ఎకరం స్థలంలో నిర్మించారు. ముప్పై ఏళ్ల క్రితం వరకు ఇక్కడ యాభై మంది ఇంజినీర్లు, ఆఫీసర్లు, సిబ్బంది ఉండేవారు. కాలక్రమేణ కార్యాలయం ఆదరణకు నోచుకోక శిథిలమైంది.


పదివేల ఎకరాలకు పర్యవేక్షణ

నామాపూర్ సెక్షన్ కార్యాలయం నుంచి ఎగువ మానేరు కుడికాలువ కింద సాగయ్యే పదివేల ఎకరాలను పర్యవేక్షిస్తారు. ఇక్కడ డీఈఈ, నలుగురు ఏఈఈలు, 19 మంది లష్కర్లు, ఇద్దరు అసిస్టెంట్లు పనిచేసేవారు. కార్యాలయం కూలిపోవడంతో తాత్కాలికంగా మండలకేంద్రంలోని అద్దె గదిలో కొనసాగిస్తున్నారు. సెక్షన్ కార్యాలయం పరిధిలోని 21కిలోమీటర్ల ప్రధాన కెనాల్‌తోపాటు 19 నీటి డిస్ట్రిబ్యూటరీలను ఇక్కడి నుంచే పర్యవేక్షిస్తారు. మానేరు కెనాల్‌కు నామాపూర్ గ్రామం మధ్యన ఉంటుంది. ఎక్కడికైనా సులభంగా ఇక్కడి నుంచి వెళ్లొచ్చు. రైతులకు ఉన్నత సేవలందించేందుకు ఏర్పాటు చేసిన సెక్షన్ కార్యాలయం కాలగర్భంలో కలిసిపోవడం, రెండేళ్ల క్రితం వరకు ఒక్కరే ఏఈ పనిచేశారు. ఎగువమానేరు నుంచి వచ్చే కుడికాలువ లోతు చెరువు వద్ద మినీ జలాశయంగా అభివృద్ధి చేశారు.

ఇష్టానుసారంగా ముగుగుకాల్వ


నామాపూర్‌లోని సెక్షన్ కార్యాలయం శిథిలం కాగా దానిస్థలం ఇతరుల ఆధీనంలోకి వెళ్తోంది. ఇప్పటికే ఇష్టానుసారంగా మురుగుకాల్వ నిర్మించారు. ముందు వెనుక భాగాలు ఆక్రమణకు గురవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని ఆవరణలోనే వాటర్ ట్యాంకులు, ఓపెన్ జిమ్ నిర్మించారు. కార్యాలయంలోని ఓపెన్ వెల్, కిచెన్, టాయిలెట్స్ పనికిరాకుండా పోయాయి. బూత్ బంగ్లాను తలపిస్తోంది. సెక్షన్ కార్యాలయం నిర్మించేందుకు ఆశాఖ అధికారులు రూ.30లక్షలతో ప్రతిపాదనలు తయారుచేశారు.

కార్యాలయం నిర్మించాలి



నామాపూర్‌లో సెక్షన్ కార్యాలయం నిర్మిస్తే రైతులకు మరిన్ని సేవలు అందుతాయి. ఎక్కడైనా కెనాల్‌కు బుంగపడినా, కోతలకు గురైనా మరమ్మతు చేసే అవకాశం ఉంది. సిబ్బంది అందుబాటులో ఉంటారు. సెక్షన్ కార్యాలయం వెంటనే నిర్మించాలి. – కిషన్‌రావు, నీటి సంఘాల మాజీచైర్మన్

అందుబాటులో అధికారులు



గతంలో నామాపూర్ కార్యాలయంలో సార్లు ఉండేవారు. ఇప్పుడు కార్యాలయం లేకుండా పోయింది. ఆఫీసు ఉంటే అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. రైతుల పొలాలు ఎండకుండా చూసుకుంటారు. – అనమేని రాజు, రైతు, పోతుగల్

స్థలం కబ్జా కాకుండా చర్యలు



నామాపూర్‌లో సెక్షన్ కార్యాలయం శిథిలమైంది. స్థలం కబ్జా కాకుండా చర్యలు చేపడుతాం. రూ.30లక్షలతో నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశాం. మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. అద్దె భవనంలో కార్యాలయం నడుస్తోంది. రైతులకు ఇబ్బందులు కాకుండా చూస్తాం. – రవికుమార్, డీఈఈ

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

గంభీరావుపేట: కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ మండలంలోని నర్మాల గ్రామంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి, నాయకులు దేవేందర్‌యాదవ్, రాజుగౌడ్, విగ్నేష్, మల్లేశ్, ఎల్లం, నాగరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..



ఎల్లారెడ్డిపేట: కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర శివారులోని వంతెనపై ఏర్పడ్డ గుంత ప్రమాదకరంగా ఉంది. ప్రధాన రహదారి కావడంతో సిరిసిల్ల, కామారెడ్డి ప్రాంతాలకు వెళ్లే వాహనాలు వేగంగా ఉంటాయి. పదిర శివారులోని బ్రిడ్జిపై పడ్డ గుంతను గమనించకపోతే అదే వేగంతో అందులో దిగితే నేరుగా బ్రిడ్జి కిందకు పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.